సాక్షి మంచిర్యాల

శనివారం । 5 । అక్టోబర్ । 2024

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పరిశీలన

కాసిపేట: మండలంలోని లంబాడితండా(కె)లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను రెండో రోజు శుక్రవారం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ పరిశీలించారు. 179 కుటుంబాల సర్వే పూర్తయ్యిందని, రెండు టీమ్‌లు ఏర్పాటు చేసి వివరాలు నమోదు చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా సర్వే పూర్తి చేసి వివరాలు నమోదు చేయాలని ఆయన సూచించారు. ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీ షేక్ సబ్బర్అలీ పాల్గొన్నారు.



గనుల్లో అమ్మవారికి పూజలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ 1, ఎస్సార్పీ 3 గనుల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘ నంగా జరుగుతున్నాయి. శుక్రవారం గనులపై జరిగిన కార్యక్రమంలో జీఎం సంజీవరెడ్డి దంపతులు పాల్గొన్నారు.

రోజూ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలి

కోటపల్లి: గ్రామపంచాయతీల్లో రోజూ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. పార్‌పల్లి, లింగన్నపేట, ఎదులబంధం, పుల్లగామ, రొయ్యలపల్లి గ్రామాల్లో శుక్రవారం డీపీవో వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేసి పారిశుద్ధ్య కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. వారంలో రెండు రోజులు డ్రైడే నిర్వహించాలని, ఫాగింగ్ చేయాలని ఆదేశించారు.

క్లుప్తంగా

బస్‌స్టేషన్‌లో రద్దీ..!



బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ

మంచిర్యాలఅర్బన్: దసరా పండుగ నేపథ్యంలో మంచిర్యాల ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ పెరుగుతోంది. ఈనెల 6 నుంచి కళాశాలలకు సెలవులు కావడంతో విద్యార్థులు శుక్రవారం నుంచి ఇంటిబాట పట్టారు. పలు రైళ్ల రద్దుతో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. బెల్లంపల్లి, మందమర్రి, లక్సెట్టిపేట్, చెన్నూర్ తదితర ప్రాంతాల నుంచి పండుగ సామగ్రి కోసం మంచిర్యాలకు పెద్ద ఎత్తున ప్రజలు వస్తుండడంతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి.

ఇంటిపై విరిగిపడ్డ వృక్షం

బెల్లంపల్లి: భారీ వర్షానికి ఓ ఇంటిపై వృక్షం విరిగిపడిన ఘటన శుక్రవారం బెల్లంపల్లిలో చోటు చేసుకుంది. సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురవగా 16వ వార్డు పరిధి ఫుట్‌బాల్ గ్రౌండ్ బస్తీ వెనకాల ఉన్న దూడ సురేశ్ అనే వ్యక్తికి చెందిన ఇంటిపై శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఉన్న వృక్షం విరిగి పడింది. ఘటనలో సురేశ్ ఇంటి పైకప్పు సిమెంట్ రేకులు విరిగిపోయాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

'శనిగకుంట' కేసును ఎన్‌ఐఏకు అప్పగించాలి

చెన్నూర్: చెన్నూర్ శనిగకుంట మత్తడి పేల్చివేత ఘటనలో పోలీసులపై ఒత్తిడి తెచ్చి కొందరిని తప్పించారని, అసలైన దోషులకు శిక్ష పడాలంటే కేసును ఎన్ఐఏకు అప్పగించాలని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేల్చివేత కేసులో అధికార పార్టీ నాయకులను పక్కనపెట్టి సానుభూతి పరులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించారని ఆరోపించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, పట్టణ ప్రధాన కార్యదర్శులు వెంకటనర్సయ్య, శ్రీపాల్, కౌన్సిలర్లు శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శంకర్, రాజు, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ సబ్‌ప్లాన్' రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కోటపల్లి: ఎస్సీ సబ్‌ప్లాన్ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కేంద్రియ మెట్టపరిశోధన సంస్థ నోడల్ అధికారి టి.వి ప్రసాద్ అన్నారు. శుక్రవారం రాపన్‌పల్లి, అర్జునగుట్ట గ్రామాల్లోని ఎస్సీ రైతులకు కేంద్రియ మెట్ట పరిశోధన సంస్థ, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎస్సీసబ్‌ప్లాన్‌లో వచ్చిన పెసర్లు వందశాతం సబ్సిడీతో అందజేశారు. నోడల్ అధికారి టి.వి ప్రసాద్ మాట్లాడుతూ నది పరీవాహక ప్రాంతం కావడంతో ఇటీవల కురిసిన వర్షాలతో మునిగిపోయినందున రైతులకు పెసర్లను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. అనంతరం కోటపల్లి రైతువేదికలో టేకు మొక్కలను నాటి, పెంచే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్‌ప్లాన్ కో ఆర్డినేటర్లు సంపత్, సునీల్ పాల్గొన్నారు.

బాలా త్రిపురదేవిగా అమ్మవారు



దండేపల్లిలో అమ్మవారికి పూజలు

జన్నారం/ దండేపల్లి: శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారు బాలా త్రిపురదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని చీరతో అలంకరించి బెల్లం పరమాన్నంతో నైవేద్యం సమర్పించారు.

వర్షంతో మార్కెట్‌లో ఇబ్బందులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలోని కూరగాయల మార్కెట్ ముందు విక్రయాలు జరుపుతున్న వ్యాపారులు శుక్రవారం కురిసిన వర్షానికి ఇబ్బందులు పడ్డారు. కూరగాయలతో పాటు వ్యాపారులు, కొనుగోలుదారులు వర్షంలో తడిసిపోయారు. మార్కెట్ ఏరియా బురదమయంగా మారి తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కొత్తగా నిర్మాణం చేసిన కూరగాయల మార్కెట్‌ను ప్రారంభించినా ఇంకా స్టాల్స్‌లో అమ్మకాలు జరుపకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావును 'సాక్షి' వివరణ కోరగా వ్యాపారులు శరన్నవరాత్రి వేడుకలు ముగిశాక స్టాల్స్‌లో క్రయవిక్రయాలు చేపడతామని పేర్కొన్నట్లు తెలిపారు.

'వైద్యశాల' భవన నిర్మాణమెప్పుడో?

- ఆయుర్వేద వైద్యశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు
- నాలుగు గుంటల స్థలం కేటాయించిన ప్రభుత్వం
- టెండర్ ప్రక్రియ పూర్తయినా ప్రారంభం కాని పనులు
- ఇరుకు గదిలో కొనసాగుతున్న వైద్యశాల



ఆయుర్వేద వైద్యశాల భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం

నస్పూర్: మండలంలో ఆయుర్వేద వైద్యశాల భవన నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. శాశ్వత భవన నిర్మాణానికి నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా నిర్మాణ పనులు మాత్రం ఇప్పటికీ ప్రారంభం కాలేదు. దీంతో ప్రస్తుతం నస్పూర్ పీహెచ్‌సీ భవనంలోని ఓ చిన్న గదిలో ఆయుర్వేదిక్ ఆసుపత్రి కొనసాగుతోంది. గది ఇరుకుగా ఉండడంతో పాటు కనీస మౌలిక వసతులు కూడా లేకపోవడంతో వైద్య సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

2016లోనే స్థలం కేటాయింపు

నస్పూర్ పీహెచ్‌సీ భవనం పక్కన నస్పూర్ శివారు సర్వే నంబరు 64లో 2016లో ఆయుర్వేద వైద్యశాల శాశ్వత భవన నిర్మాణానికి ప్రభుత్వం నాలుగు గుంటల స్థలం కేటాయించింది. భవన నిర్మాణానికి రూ.16 లక్షల నిధులు కూడా మంజూరు చేసింది. కొన్ని నెలల క్రితం టెండర్ ప్రక్రియ సైతం పూర్తయింది. కానీ భవన నిర్మాణ పనులు మాత్రం నేటికీ ప్రారంభం కాలేదు.

దారి లేకేనా..?

ఆసుపత్రికి కేటాయించిన స్థలానికి ముందు జాతీయ రహదారికి ఆనుకుని సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా 64వ సర్వే నంబరులో 10 గుంటల స్థలం కోర్టు వివాదంలో ఉంది. ఆసుపత్రి భవన నిర్మాణానికి కేటాయించిన స్థలంలోనికి వెళ్లాలంటే ఈ స్థలం నుంచి దారి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సదరు స్థలం కోర్టు వివాదంలో ఉండడం.. ఆసుపత్రి భవనానికి దారి లేకపోవడంతో భవన నిర్మాణ పనులు ప్రారంభించడానికి జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది.

మరిన్ని వైద్యసేవలు..

ఆయుష్మాన్ వైద్యశాల శాశ్వత భవన నిర్మాణం పూర్తయితే అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. కేరళ పంచకర్మ, హోమియోపతి, యునాని వైద్య చికిత్స సేవలు అందుబాటులోకి వస్తాయి. పక్షవాతం వంటి దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు సైతం చికిత్స అందించే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని భవన నిర్మాణ పనులు ప్రారంభానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



వైద్యశాల భవన నిర్మాణానికి ఉన్న అడ్డంకులు తొలగించి భవన నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించాం. వీలైతే మరికొంత స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశాం. భవనం అందుబాటులోకి వస్తే మరిన్ని వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ పద్మజ, మెడికల్ ఆఫీసర్, ఆయుర్వేదిక్ వైద్యశాల, నస్పూర్

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

లక్సెట్టిపేట: వైద్యులు ప్రజలకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, వెంకట్రావుపేట గ్రామంలోని పీహెచ్‌సీలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోగులకు సౌకర్యాలు కల్పించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని వారికి అన్ని విధాల వైద్య సేవలందించాలని కోరారు. అనంతరం ఆసుపత్రిలో రోగులను, పరిసరాలను పరిశీలించారు. ఎంపీడీవో సరోజ, వైద్యాధికారులు శ్రీనివాస్, సతీశ్, సురేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ చట్టాలు అతిక్రమిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న తిరుపతి

తాండూర్: అటవీ చట్టాలను ఎవరు అతిక్రమించిన కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ రేంజ్ అధికారి తిరుపతి అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మాదారం ఫారెస్ట్ కార్యాలయం వద్ద ఫ్లెక్సీ ఆవిష్కరించారు. అనంతరం స్థానికులకు అటవీ చట్టాలపై అవగాహన కల్పించారు. ఎవరూ కూడా వన్యప్రాణులను వేటాడొద్దని, వాటిని హింసించవద్దని పేర్కొన్నారు. అనంతరం మాదారం త్రీ ఇన్‌క్లెయిన్ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి సువర్ణ, బీట్ అధికారులు భాస్కర్, గోపికృష్ణ, యశోద, రాంచందర్, శ్రీనివాస్, రాజం పాల్గొన్నారు.

నెన్నెల: అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని కుశ్నపల్లి రేంజ్ అధికారి దయాకర్ అన్నారు. శుక్రవారం వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి దయాకర్ మాట్లాడుతూ వన్యప్రాణులతోనే పర్యావరణం సమతుల్యంగా ఉంటుందన్నారు. వన్యప్రాణుల ప్రాముఖ్యతను వివరించారు. వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని టౌన్ 1 ఎరియా ఫీడర్ పరిధిలోని పాత సినిమా టాకీస్ ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

పంటల క్షేత్రస్థాయి పరిశీలన



అక్కెపల్లిలో పత్తి పంట పరిశీలిస్తున్న ఏడీఏ

చెన్నూర్‌రూరల్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏడీఏ బానోత్ ప్రసాద్ శుక్రవారం మండలంలోని అక్కెపల్లి గ్రామంలో ఎంపిక చేసిన సర్వే నంబర్లలో పంటల సాగు వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సిబ్బంది ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. వరి, పత్తి పంటలలో వచ్చే ప్రస్తుత చీడపీడల నివారణకు ఎలాంటి మందులు వాడాలో తెలియజేశారు. పత్తిలో రసంపీల్చే పురుగుల నివారణకు డైఫెంథ్యూరాన్ మందును లీటరు నీటిలో ఒక గ్రాము కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకుమచ్చ, కాయమచ్చ తెగుళ్ల నివారణ కోసం హై ఫ్లోకొనజోల్, మ్యాంకోజెబ్ మందును లీటరు నీటికి రెండు గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మెగ్నీషియం దాతులోప నివారణకు మెగ్నీషియం సల్ఫేట్‌కేజీ ఎకరానికి, గూడ రాలడం అలాగే సూక్ష్మదాతు లోప నివారణ కోసం బోరాన్ 250గ్రాములు ఎకరానికి, 200ల లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పీఎం కిసాన్ కేవైసీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

తాండూర్: పత్తి పంటను ఆశించే చీడపీడల పట్ల అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి ఏడీఏ రాజానరేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో స్థానిక వ్యవసాయ అధికారి ప్రేమ్‌కుమార్‌తో కలిసి పత్తి క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పత్తి పంటలో వచ్చే తెగుళ్లు, చీడపీడలపై సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం రేచిని గ్రామంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు శంకర్, ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.

'దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం'



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలో ఈనెల 12న దసరా వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని సింగరేణి మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. శుక్రవారం ఏరియా జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఉత్సవ కమిటీ ఏర్పాటు చేశారు. ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, వర్క్‌షాప్ డీవైజీఎం కృష్ణారెడ్డి, డీవైజీఎం స్టోర్ హైదీశ్వర్, డీవైజీఎం సివిల్ శ్రీనివాసులు, ఏఐటీయూసీ కార్యదర్శి అక్బర్ అలీ, మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సుదర్శన్, సహాయ కార్యదర్శి రాజేశం, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, అంటోని, దినేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఎదురు మాట్లాడితే కేసులే

- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు



కూల్చిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు ఎవరైనా ఎదురు మాట్లాడితే తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్‌రోడ్డులో అక్రమంగా కట్టిన కట్టడాలను మున్సిపల్ అధికారులు తొలగించగా, శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు రాజకీయ నాయకులు చెప్పినట్లుగా కాకుండా, ప్రజలకు ఉపయోగపడేలా పనిచేయాలన్నారు. ప్రభుత్వాలు, నాయకులు శాశ్వతం కాదని, తరువాత అధికారులే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. పండుగ సమయంలో దుకాణాలను కూల్చడాన్ని ఖండించారు.

భూముల క్రమబద్ధీకరణ కోసం సర్వే

భీమారం: మండల కేంద్రంలో భూముల క్రమబద్ధీకరణ కోసం పంచాయతీ అధికారులు శుక్రవారం మొబైల్ యాప్ ద్వారా సర్వే నిర్వహించారు. పంచాయతీ పరిధిలో క్రమబద్ధీకరణ కోసం 316 దరఖాస్తులు రాగా మొదటి రోజు 25 మంది ఇళ్ల స్థలాలకు వెళ్లి సర్వే చేసినట్లు పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కృష్ణమూర్తి తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రామకృష్ణాపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె.శ్రీనివాస్ అన్నారు. మందమర్రి ఏరియాలోని ఆర్కేపీ సీహెచ్‌పీలో శుక్రవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సీహెచ్‌పీలో బెల్ట్ క్లీనింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. నాయకులు ప్రవీణ్, కృష్ణమోహన్, శివ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

వేమనపల్లి: మాజీ ఎంపీపీ ఆకుల లింగాగౌడ్‌తో పాటు సుమారు 300 మంది బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్, మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శ్రీనివాస్, సంతోష్, చిరంజీవి, శంకర్, పవన్, రూపేష్, రాజేష్‌గౌడ్, తిరుమలేష్, సంతోష్‌గౌడ్, రామాగౌడ్, రాజాగౌడ్, మహేష్‌గౌడ్‌లు పార్టీలో చేరారు.

'అసలు దోషులను వదిలిపెట్టడం సరికాదు'

చెన్నూర్: శనిగకుంట మత్తడి పేల్చివేత కేసులో అసలు దోషులను వదిలిపెట్టి, అమాయకులను అరెస్టులు చేయడం సరికాదని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు రాజా రమేశ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చెప్పినట్లుగా పోలీసులు కేసులో ఉన్న అధికార పార్టీకి చెందిన వారిని వదిలిపెట్టి, అమాయకులైన దళిత, బీసీ వర్గాలకు చెందిన వారిని బలిపశువులు చేయడం దారుణమన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ నవాజ్, మాజీ ఎంపీపీ మంత్రి బాపు, కౌన్సిలర్లు మహేశ్, అనిల్, రమేశ్, శంకర్, కృష్ణ, ఆరీఫ్, ప్రభాకర్, పాశం ఆశీస్, వెంకటరాజం పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులు కష్టపడి చదవాలి

లక్సెట్టిపేట: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత హోదాలో ఉండాలని తహసీల్దార్ దిలీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలలో పాల్గొన్నారు. విద్యార్థులు వార్షిక పరీక్షలతో పాటు కాంపిటేటివ్ పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. వాగేశ్వరి జూనియర్ కళాశాల విద్యార్థులు స్థానిక ఎస్ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, లక్ష్మణ్, డైరెక్టర్లు చక్రపాణి, అభినయ్, సుధాకర్, తిరుపతి, శ్రీధర్‌రెడ్డి, మహేందర్, సాగర్, శ్రీనివాస్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జట్టుకు క్రీడాదుస్తులు పంపిణీ

మంచిర్యాలఅర్బన్: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్ 17 బాలబాలికల ఫుట్‌బాల్ జట్టుకు డీఈవో యాదయ్య శుక్రవారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈనెల 5 నుంచి భద్రాద్రి కొత్తగూడెంలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు బాలుర జట్టు, ఈనెల 6నుంచి మెదక్‌లో జరుగనున్న పోటీల్లో పాల్గొనేందుకు బాలికల జట్టు బయలుదేరనుందని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఫణిరాజా తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రామ్మోహన్, డీఎస్‌వో మధుబాబు, సూపరింటెండెంట్ సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, సురేందర్ పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు గైర్హాజరు

మంచిర్యాలఅర్బన్: ఓపెన్ పదోతరగతి, ఇంటర్ ఇంగ్లిష్ పరీక్షలకు శుక్రవారం 61 మంది గైర్హాజరయ్యారు. పదోతరగతి కోసం ఒకటి, ఇంటర్ పరీక్షల కోసం రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పదోతరగతి పరీక్షలకు 67 మందిగాను 36 మంది పరీక్షలు రాయగా 31 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో 114 మందిగాను 84 మంది హాజరుకాగా 30 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఈవో యాదయ్య పరిశీలించారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

పాతమంచిర్యాల: హైదరాబాద్‌లో ఈ నెల 9న తెలంగాణ ప్రజా ఫ్రంట్ 15వ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలని, పార్టీ జిల్లా కన్వీనర్ జైపాల్‌సింగ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజా కళా మండలి జిల్లా కన్వీనర్ ఆడెపు సమ్మయ్య,నాయకులు పోషన్న, సమ్మయ్య పాల్గొన్నారు.

ఇద్దరి బైండోవర్

భీమారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 138లో అక్రమంగా మట్టిని తీసి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్ల యజమానులు మెండె పున్నం, బొల్లం శ్రీనివాస్‌లను శుక్రవారం తహసీల్దార్ సదానందం ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రాములు తెలిపారు. మరోసారి అక్రమ రవాణాకు పాల్పడితే ఒక్కొక్కరు రూ.5 లక్షలు జరిమానా చెల్లించాలని తహసీల్దార్ ఆదేశించినట్లు పేర్కొన్నారు. సొంత పూచికత్తుపై వారిని విడుదల చేసినట్లు ఎస్సై తెలిపారు.

రేపు దుర్గామాత మహాసంకల్ప శోభాయాత్ర

మంచిర్యాలఅర్బన్: వనతి వాక్కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 6న 108 కళశాలతో దుర్గామాత మహాసంకల్ప శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వేణుకుమార్ తెలిపారు. స్థానిక విశ్వనాథ ఆలయం నుంచి మొదలుకొని ఆర్‌బీహెచ్‌వీ గ్రౌండ్ వరకు శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. అమ్మవారికి అభిషేకం, అష్టోత్తర శతనావళి పారాయణం, బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా చండీహోమం

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్కే 1ఏ గనిలో శుక్రవారం మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చండీహోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరాజు, ఆర్కే1ఏ ఇన్‌చార్జి మేనేజర్ జయంత్‌కుమార్, దుర్గయ్య, సారయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

పరామర్శ

దండేపల్లి: మండలంలోని రాజుగూడకు చెందిన ఏదుల కళవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో కుటుంబాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ శుక్రవారం పరామర్శించారు.

నేడు రక్తదాన శిబిరం

చెన్నూర్: చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాజీ కేంద్రమంత్రి స్వర్గీయ గడ్డం వెంకటస్వామి 95వ జయంతి సందర్భంగా శనివారం ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

నెన్నెల: మండలంలో శుక్రవారం బీజేపీ నాయకులు బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటా తిరుగుతూ సభ్యత్వం నమోదు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటకృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ సంతోష్, నాయకులు కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు శైలేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీల నిర్మాణానికి భూమిపూజ

తాండూర్: మండలంలోని ప్రాథమిక పాఠశాలల ప్రహరీ నిర్మాణాలకు అధికారులు, నాయకులు శుక్రవారం భూమిపూజ చేశారు. మండలంలోని కిష్టంపేట ప్రాథమిక పాఠశాలకు రూ.5 లక్షలు, బెజ్జాల ప్రాథమిక పాఠశాలకు రూ.2 లక్షలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టనున్న ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ కుమారస్వామి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, సింగిల్ విండో వైస్‌చైర్మన్ రత్నాకర్ రావు, మాజీ జెడ్పీటీసీ బానయ్య ఉన్నారు.

బాధితుల వినతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల -ఆర్మూర్ నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తాము తీవ్రంగా నష్టపోతున్నామని, పాత అలైన్‌మెంట్ ప్రకారం రహదారి విస్తరణ పనులు చేపట్టాలని కోరుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి శుక్రవారం హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల్లోని ఎన్‌హెచ్ -63 బాధితులు కరీంనగర్‌లో వినతిపత్రం అందజేశారు. రహదారుల శాఖా దృష్టికి తీసుకెళ్లి రహదారి విస్తరణలో పునరాలోచన చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి తదితరులు ఉన్నారు.